RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:184 శనివారం 01 ఆగస్టు 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలి

- వెలువడిన హైకోర్టు ఉత్తర్వులు




హైదరాబాద్,జూలై 31 : హైడ్రా శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలన్న హైకోర్టు


మిగతా 2వ పేజీలో..



## రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఊరట

- ఈ-కేవైసీ గడువు పొడిగింపు..
- ఆగస్టు 31 వరకు అవకాశం
- మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ కోటా బియ్యం ఒకేసారి అందజేత

3




## మరోమారు 'సర్' గడువు పొడిగింపు

- మరో వారం రోజులు పొడిస్తూ ఈసీ ఆదేశాలు
- ఆగస్ట్ 10 వరకు పొడిగించినట్లు వెల్లడి

2



# తెలంగాణకు రండి.. పెట్టుబడులు పెట్టండి

- అందుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం
- రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదు
- సీఐఐ ఉత్తర భారత ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్

2



## డ్యామేజ్ కంట్రోల్ ఫార్ములా

- కేటీఆర్‌పై నమోదైన ఆరోపణలపై బీఆర్ఎస్ కొత్త వ్యూహం
- ఫార్ములా-ఈ కేసులో నష్ట నివారణకు రివర్స్ అటాక్..
- సోషల్ మీడియా వేదికగా ఆరోపణలకు కౌంటర్లు
- రాజకీయ ఉద్దేశాలతోనే కేసు నమోదు చేశారంటూ ఎదురుదాడి
- హైదరాబాద్ బ్రాండ్ విలువ పెంచేందుకే 'ఫార్ములా-ఈ రేస్' అంటూ వివరణ
- ప్రజాభిప్రాయాన్ని మార్చేందుకు సోషల్ మీడియా ప్రచారానికి ప్రాధాన్యం

3

## నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్



- ఫార్ములా ఈ రేస్ కేసు తదుపరి విచారణ 25కు వాయిదా

హైదరాబాద్,జూలై 31 : ఫార్ములాఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ

మిగతా 3వ పేజీలో..



## పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు.. ఆ బాధ్యత టామ్‌కామ్‌దే

- స్కిల్ వర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి
- ఏటీసీల్లో అత్యాధునిక కోర్సులకు ప్రాధాన్యం
- శక్తి శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్ల పంపిణీ

- అర్హుల గుర్తింపు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- తాగునీటి సరఫరాకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



2



## భద్రాచలం వద్ద వేగంగా పెరుగుతున్న గోదావరి

- మొదటి ప్రమాద హెచ్చరికను దాటిన ప్రవాహం
- సాయంత్రానికి 50 అడుగులు చేరుకునే అవకాశం
- లోతట్టు ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

2

## ఆగస్టు చివరి వారంలో ఇందిరమ్మ టవర్స్ కు శ్రీకారం

- టెండర్ ప్రక్రియ ప్రారంభం
- మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తి
- ఆధార్ ఒక్కటే కాదు.. నివాస ధ్రువీకరణకు పలు పత్రాలు చెల్లుబాటు
- ఇల్లు రాకపోతే ₹10 వేల ఈఎండీ వంద శాతం తిరిగి చెల్లింపు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

3





## ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను బలోపేతం చేయాలి

- సీఎస్ సంజయ్ జాజు అధ్యక్షతన ట్రస్ట్ సమావేశం
- చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్ష
- ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని నిర్ణయం
- అత్యవసర వైద్య సహాయానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి

2

## ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వాన్ని సహించం

- కంపెనీల పనితీరుపై మంత్రి తీవ్ర అసంతృప్తి
- లక్ష్య సాధనలో విఫలమైన కంపెనీలపై కఠిన చర్యలు తప్పవు
- ఆయిల్ ఫెడ్‌కూ మినహాయింపు లేదు : మంత్రి తుమ్మల

3

## అధికారిక లాంఛనాలతో పెద్ది అంత్యక్రియలు

- జనహృదయ నేతకు కన్నీటి వీడ్కోలు.. నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు
- మంత్రి సీతక్క, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు నేతల నివాళి
- వేలాది మంది అభిమానుల మధ్య నల్లబెల్లిలో అంతిమయాత్ర
- ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే
- తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

3



3

పెద్ది సుదర్శన్‌రెడ్డి చిరస్మరణీయుడు



## హద్దులు దాటితే కఠిన చర్యలు

- పోలీస్ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు
- ట్రైనీ ఐపీఎస్ వ్యవహారంలో నిష్పాక్షిక విచారణకు హామీ
- వివాదాస్పద అధికారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు
- ఇప్పటికే పలువురు అధికారులపై సస్పెన్షన్ చర్యలు
- సీపీ సజ్జనార్

3



## పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు..
# ఆ బాధ్యత టామ్‌కామ్‌దే

- **స్కిల్ వర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి**
- **ఏటీసీల్లో అత్యాధునిక కోర్సులకు ప్రాధాన్యం**
- **డిమాండ్‌కు తగినట్లు నర్సింగ్ కళాశాలల ఏర్పాటు**
- **శక్తి శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జూలై 31 :**

విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలతోపాటు ఉద్యోగార్థులకు అవసరమైన పాస్‌పోర్టు, ఆయా దేశాల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను టామ్‌కాం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. శక్తి శాఖపై ఆ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్య ప్రాచ్య దేశాలకు వెళ్తుంటారని, ఈ క్రమంలో వారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇబ్బందిపడుతున్నారని సీఎం తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారికి టామ్‌కాం పాస్‌పోర్టులు ఇప్పించడంతోపాటు వారు వెళ్లే దేశాల్లోని మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. విదేశీ కంపెనీలతో టామ్‌కాం ఒప్పందం చేసుకోవడం ద్వారా అక్కడకు వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చర్చలు జరపడానికి, వారికి న్యాయం చేయడానికి వీలుంటుందని అభిప్రాయపడ్డారు. కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్ల వివరాలు సేకరించి వారు పంపించే ప్రతీ వ్యక్తి వివరాలు నమోదు చేయాలని సీఎం సూచించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణకు టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని తెలిపారు. ఉద్యోగార్థులకు లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇప్పించాలన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. జర్మనీ, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితోపాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సీఎం చెప్పారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రీలొకేటెడ్ చెట్లను నాటాలని సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లే బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని అన్నారు. ఓ వైపు చదువుకుంటూనే మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని, భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారని అన్నారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం సూచించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని సీఎం సూచించారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందని, అందుకు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు సీఎం తెలిపారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, శక్తి కార్యదర్శి హరిచందన, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం వద్ద వేగంగా పెరుగుతున్న గోదావరి


**భద్రాచలం, జూలై 31:**

భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక దాటగా సాయంత్రం వరకు 50 అడుగులకు పెరిగే అవకాశం వున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతున్నది. గురువారం సాయంత్రానికి 28 అడుగులు ఉన్న నీటిమట్టం శుక్రవారం ఉదయం 41 అడుగులకు చేరుకుంది. ఇది వేగంగా పెరుగుతూ 10 గంటల సమయంలో 43 అడుగులు దాటి 9,74,666 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

మధ్యాహ్నానికి 45 అడుగులకు చేరుకుంది. కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పూర్తిగా మునిగిపోయాయి. 48 అడుగులకు చేరుకుంటే అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. కాగా, ఎగువ ప్రాంతంలోని సమ్మక్క సారక్క బ్యారేజ్, ఇంద్రావతి, ప్రాణహిత ప్రాజెక్టు నుండి దిగువ ప్రాంతానికి భారీగా వరద నీరు విడుదల చేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతున్నది. ఈరోజు సాయంత్రానికి 50 అడుగులు వచ్చే అవకాశం ఉన్నట్లు సిడబ్ల్యుసి అధికారులు చెబుతున్నారు. గోదావరి నీటిమట్టం వేగంగా పెరగటంతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార వర్గాలు సూచించాయి. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేవిధంగా అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఎవరూ కూడా గోదావరి వైపు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

**కాళేశ్వరం వద్ద ఉధృతి**

కాళేశ్వరం : ఎగువ ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కాళేశ్వరం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు సీడబ్ల్యూసీ కాళేశ్వరం స్టేషన్ వద్ద గోదావరి నీటిమట్టం 11.50 మీటర్లకు చేరింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వాతావరణం మేఘావృతమై ఉంది. మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 96.40 మీటర్లు నమోదైంది. బ్యారేజ్ వద్ద మొత్తం 8,35,800 క్యూసెక్కుల వరద ప్రవాహం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోగా కొనసాగుతుండగా, వరద నీటిని దిగువకు విడుదల చేసేందుకు 85 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచారు. ప్రస్తుతం గోదావరి నది బ్యారేజ్ వద్ద ఫ్రీ ఫ్లో పరిస్థితిలో ప్రవహిస్తోంది. కాళేశ్వరం వద్ద హెచ్చరికస్థాయి 12.210 మీటర్లు, ప్రమాదస్థాయి 13.460 మీటర్లుగా ఉండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



# తెలంగాణకు రండి.. పెట్టుబడులు పెట్టండి

**హైదరాబాద్, జూలై 31 :**

వివిధ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ సురక్షిత స్థానమని, తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టాలని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఉత్తర భారత ప్రతినిధులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ప్రజా ప్రభుత్వం పెట్టుబడులకు రక్షణగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సీఐఐ ఉత్తర భారత ప్రతినిధులు శుక్రవా రం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ 140 ఏళ్లుగా విజయవంతంగా కొనసాగుతున్నట్లే సీఐఐ కూడా 130 ఏళ్ల నుంచి విజయవంతంగా కొనసాగుతోందన్నారు. తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ఫలితాలను ఇప్పుడు మనం అనుభవిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మారినా తెలంగాణలో పారిశ్రామిక విధానాలను మార్చడం లేదని సీఎం అన్నారు. 1994 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు అనేక పెట్టుబడులను ఆకర్షించారని, బిల్ గేట్స్, బిల్ క్లింటన్ వంటి దిగ్గజాలను హైదరాబాద్‌కు తీసుకువచ్చారని సీఎం గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, అవుటర్ రింగ్ రోడ్డు, ఫార్మా, ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో వాళ్లు కొన్ని పాలసీలు తీసుకొచ్చారని, వాటిని కొనసాగిస్తూనే తాము సరికొత్త పాలసీలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదని, నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకొస్తే అది కొనసాగుతోందన్నారు. తమ పారిశ్రామిక విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, మంచి ప్రతిపాదనలతో వచ్చిన వారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నామని సీఎం తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలనేది తమ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీని గ్లోబల్ సమ్మిట్‌లో ప్రకటించామన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, అది 10 శాతంగా ఉండాలన్నదే తన లక్ష్యమని సీఎం వెల్లడించారు. కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబయి, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమవుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించామని సీఎం తెలిపారు. ప్యూర్, రేర్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇవ్వడంతోపాటు ఇతర వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మించనున్నామని, విభాగాల వారీగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని సీఎం వివరించారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో ఎయిర్‌పోర్టుల నిర్మాణాలకు కేంద్రం అనుమతి తెలిపిందని, ఏడు బుల్లెట్ ట్రైన్లను కేంద్రం ప్రకటిస్తే మ□డు తెలంగాణకు వచ్చాయని, శంషాబాద్ నుంచి చెన్నై, శంషాబాద్ నుంచి పూణె, శంషాబాద్ నుంచి బెంగళూరు బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయని చెప్పారు. పొరుగు రాష్ట్రాలతో పోటీ పడదల్చుకోలేదని, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోటీ పడి చైనా ం కంట్రీగా తెలంగాణను నిలపడమే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2037 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుందని సీఎం అన్నారు. పారిశ్రామికవేత్తలు తమకు ఏం కావాలో చెబితే ఆ వసతులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారని, పరిశ్రమల శాఖ మంత్రి ప్రతి రెండు నెలలకోసారి, తాను ప్రతి మూడు నెలలకొకసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం తెలిపారు.

ఏఐ సునామీతో వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని, దాంతో తాము నైపుణ్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పామని, దేశంలోనే తమది బెస్ట్ స్కిల్ యూనివర్సిటీ అని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని, అందులో శిక్షణ పొందిన వారికి 100 శాతం ఉద్యోగాలు వచ్చాయని సీఎం తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులనే బోధిస్తున్నామన్నారు. ఇక్కడి జీసీసీల్లో 200 కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని, అమెజాన్ తన డేటా సెంటర్లపై రూ.లక్ష కోట్ల పెట్టుబడి, అదాని రూ.35 వేల కోట్లు డేటా సెంటర్‌పైన పెట్టుబడి పెడుతోందని సీఎం తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సీఐఐ నార్తర్న్ రీజియన్ వైస్ చైర్మన్ శారదా సూరి మార్వా, ప్రతినిధులు కృష్ణ బోధనపు, గౌరవ్ మహేశ్వరి, వనిత దాట్ల, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వినోద్ కెబాప్న తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర విధానాలకు ఆకర్షితులమయ్యాం : పునీత్ కౌరా, సీఐఐ నార్తర్న్ రీజియన్ చైర్మన్**

తెలంగాణ పారిశ్రామిక విధానాలు చాలా బాగున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, ఇస్తున్న మద్దతుతో జీసీసీలు హైదరాబాద్‌కు వరుస కడుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఇక్కడ ఉంది. మౌలిక వసతులు, ప్రభుత్వ సహాయ సహకారాలు మెరుగ్గా ఉండడంతోనే సమావేశానికి హైదరాబాద్‌ను ఎంచుకున్నాం. ఇక్కడ అధ్యయనం చేసేందుకు వచ్చాం.

# ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్ల పంపిణీ

- **అర్హుల గుర్తింపు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సీఎం ఆదేశం**
- **అన్ని గ్రామాల్లో తారురోడ్లు, పంచాయతీ భవనాల నిర్మాణంపై దృష్టి**
- **తాగునీటి సరఫరాకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**
- **ఇందిరమ్మ చీరలు నాణ్యత, ఆకర్షణీయమైన డిజైన్లతో తయారు చేయాలి**
- **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, జూలై 31**

తెలంగాణలో చేయూత పథకం కింద కొత్త పింఛన్లను ఆగస్టు 15 నుంచి పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన అర్హుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, నేత కార్మికులు, గీత కార్మికులతోపాటు థలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా బాధితులను కూడా పథకంలో చేర్చాలని స్పష్టం చేశారు. దివ్యాంగులు మరణించిన సందర్భాల్లో వారి భార్యలకు ఆలస్యం లేకుండా పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు.

గురువారం తన నివాసంలో మంత్రి సీతక్కతో కలిసి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో తారురోడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాలను జనాభా ప్రాతిపదికన ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. స్థానిక జలవనరుల ఆధారంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని, గ్రామీణ నీటి సరఫరా విభాగం, హైదరాబాద్ జలమండలి, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

కోటి మంది మహిళలకు పంపిణీ చేసే ఇందిరమ్మ చీరలు అత్యుత్తమ నాణ్యతతో పాటు ఆకట్టుకునే డిజైన్లలో ఉండాలని సీఎం సూచించారు. ఇందుకోసం డిజైన్ల రూపకల్పనలో ఎన్ఐఎఫ్‌టీ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. రంగులు, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

మండల స్థాయిలో అన్ని శాఖల అభివృద్ధి పనులను ఎంపీడీవోలు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, ప్రతి 45 రోజులకు మండల ప్రజా పరిషత్ సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఎన్నికలు జరగని పంచాయతీల్లో పారిశుధ్య, అభివృద్ధి పనులు నిలిచిపోకుండా వెంటనే నిధులు విడుదల చేయాలని, గ్రామీణ నీటి సరఫరా పథకాల కింద పనిచేసే సిబ్బందికి ప్రతి నెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను బలోపేతం చేయాలి

**హైదరాబాద్, జూలై 31:**

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకునేలా కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన శుక్రవారం జరిగిన ట్రస్ట్ సమావేశంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, చికిత్స ప్యాకేజీ రేట్లు, లబ్ధిదారుల సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుతం అమలులో ఉన్న చికిత్స ప్యాకేజీ రేట్లను సమగ్రంగా పరిశీలించి, ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా పథకాన్ని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేపట్టాలని సూచించారు. ట్రస్ట్ కార్యకలాపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు అవసరమైన సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలు ప్యాకేజీ రేట్లు, ఆసుపత్రుల ఎంపిక, సేవల నాణ్యత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి ట్రస్ట్‌కు సూచనలు అందజేయాలి. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అవసరమైన ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణ వైద్య సహాయం అందేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం 24 గంటల సహాయ వ్యవస్థ, వేగవంతమైన అనుమతి ప్రక్రియ, సంబంధిత ఆసుపత్రులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఉద్యోగులు ఆరోగ్య పథకం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు





పొందేలా ట్రస్ట్ పారదర్శకంగా, సమర్థవంతంగా పని చేయాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ మహేశ్ దత్ ఎక్కా, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ జెండగే హనుమంత్ కొండిబా, కార్యదర్శులు శ్రుతి ఓజా, దివ్య, సిక్తా పట్నాయక్, టి.ఎన్.జీ.ఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీ.జీ.ఓ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, తెలంగాణ సెక్రటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీనివాస రెడ్డి, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి, పీఆర్‌టీయూ కు చెందిన దామోదర్ రెడ్డి, తెలంగాణా యూ.టి.ఎఫ్ కు చెందిన చావా రవి, ఎస్ టి యు అధ్యక్షులు సదానంద గౌడ్, తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం మహిళా అధ్యక్షురాలు ఉమా దేవి, ఎస్ టి ఎఫ్ అధ్యక్షులు డి. సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మరోమారు 'సర్' గడువు పొడిగింపు

**హైదరాబాద్, జూలై 31:**

కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మరోమారు పొడిగించింది. ఆగస్టు 10వ తేదీ వరకు ఓటర్లు తమ వివరాలను బీఎల్‌వో లకు అందజేయాలని స్పష్టం చేసింది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని సెప్టెంబర్ 16వ తేదీ వరకు కెయిములు, అభ్యంతరాలను స్వీకరిస్తామని వివరించింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు క్లెయిములను అభ్యంతరాలను పరిష్కరిస్తామని, అక్టోబర్ 19న ఫైనల్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ గడువును మరోసారి పొడిగించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించారు. ఆగస్టు 3న ముగియాల్సిన గడువును 10వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తొలుత ఈ గడువు జులై 24 వరకే ఉండగా ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా ఆ తేదీని ఆగస్టు 10కి మార్పు చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని ఈసీఐ తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం పూర్తయినట్లు పేర్కొంది. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్ పక్రియను సమీక్షించేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. అంతకుముందు ఆయనకు తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' పక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు.



# పెద్ది సుదర్శన్‌రెడ్డి చిరస్మరణీయుడు

**హైదరాబాద్, జూలై 31 :**



నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌లు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

**అంతిమయాత్రలో మంత్రి సీతక్క**

సుదర్శన్ రెడ్డి మరణం పట్ల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన మరణం బాధాకరమని అన్న మంత్రి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. సీతక్క నర్సంపేట చేరుకుని సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన భౌతిక కాయంపై పూలు ఉంచి నివాళులర్పించారు.

**బీజేపీ చీఫ్ రామచందర్ రావు సంతాపం**

సుదర్శన్ రెడ్డి మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నర్సంపేట నియోజకవర్గం, ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో ఆయన పోషించిన పాత్ర విశిష్టమైనది. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి ప్రజల విశ్వాసాన్ని చూరగొని శాసనసభ్యుడిగా సేవలందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా గుర్తుండిపోతారు. తెలంగాణ ఉద్య మంలోనూ ఆయన సేవలు చిరస్మరణీయమైనవి. పెద్ది మరణం నర్సంపేట ప్రజలకు, ఆయనను అభిమానించే ప్రతి ఒక్కరికీ తీరని లోటు. వారి ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని, ఈ విషాదాన్ని తట్టుకునే మానసిక ధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా. వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**ఓ గొప్ప నాయకుడిని కోల్పోయాం : మాజీ ఎమ్మెల్యే వొడితెల**

సుదర్శన్ రెడ్డి మృతితో తెలంగాణ సమాజం గొప్ప ప్రజా నాయకుడిని కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన గొప్ప నాయకుడు అని, ఉద్యమ స్ఫూర్తిని గ్రావి□ణ స్థాయికి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారి అన్నారు. ప్రజల కోసం, తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆయన మరణం అత్యంత బాధాకరమని పేర్కొంటూ తనతో ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర సాధనలో ఆయన పాత్రను ఎన్నటికీ మరువలేమన్నారు. ప్రజా జీవితంలో నిబద్ధత, నిరాడంబరత, ఉద్యమ పట్ల అంకితభావంతో పనిచేసిన పెద్ది సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

# ఆప్త మిత్రుడిని కోల్పోయాను

- పెద్ది మరణం పట్ల కేసీఆర్ సంతాపం
- పార్టీ అండగా ఉంటుంది

**హైదరాబాద్,జూలై 31:**



పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రుడిని, ఉద్యమ సహచరుడిని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. సుదర్శన్ రెడ్డి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతితో ఆయన తన సంతాపాన్ని ప్రకటించారు. రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో వరంగల్ జిల్లాలో తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయతీతో సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో నడిచిన పెద్ది అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధిలోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్‌బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటాయన్నారు. పెద్దిని కోల్పోయి శోకతప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు. సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఊరట

**హైదరాబాద్, జూలై 31**

తెలంగాణలో రేషన్ కార్డుదారులకు పౌరసరఫరాల శాఖ కీలక ఊరటనిచ్చింది. ఈకేవైసీ పూర్తి చేయడానికి ఉన్న గడువును ఆగస్టు 31 వరకు పొడిగించడంతో పాటు, ఆగస్టు నుంచి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చీఫ్ రేషనింగ్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. ఈకేవైసీ ప్రక్రియ పూర్తికాకపోతే రేషన్ సరుకులు నిలిచిపోతాయనే ఆందోళనలో ఉన్న లబ్ధిదారులకు ఈ నిర్ణయం ఊరటనిచ్చేలా ఉంది. గడువు పొడిగింపుతో అర్హులైన ప్రతి కార్డుదారుకు ఈకేవైసీ పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. వర్షాకాలంలో రేషన్ దుకాణాలకు పలుమార్లు వెళ్లాల్సిన ఇబ్బందిని తగ్గించేందుకు ఆగస్టు 1 నుంచి 31 వరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్నారు. దీంతో లబ్ధిదారులు ఒకే విడతలో తమ కోటా బియ్యాన్ని తీసుకునే సౌకర్యం కల్పించినట్లు పౌరసరఫరాల శాఖ వెల్లడించింది.

## ఆగస్టు చివరి వారంలో ఇందిరమ్మ టవర్స్ కు శ్రీకారం

**హైదరాబాద్, జూలై 31:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ టవర్స్ పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. సచివాలయంలో మీడియా ప్రతినిధులతో శుక్రవారం మాట్లాడిన ఆయన ఇందిరమ్మ టవర్స్ సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అది పూర్తికాగానే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరం క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ నియోజకవర్గాలతోపాటు మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు పూర్తయిందని, దశలవారీగా మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని విస్తరిస్తామని చెప్పారు. పేద కుటుంబాలు కూడా హైదరాబాద్‌లోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తే కొన్ని పార్టీలు దుష్ప్రచారం చేసినప్పటికీ ప్రజలు వాటిని నమ్మలేదని, ప్రస్తుతం భారీగా వస్తున్న దరఖాస్తులే ఇందిరమ్మ టవర్స్‌పై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల విలువైన భూముల్లో టవర్స్ నిర్మించి ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా వారి పేర రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్ల కేటాయింపు, నిర్మాణం చేపడుతున్నామని, అందువల్ల ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తుదారులు నివాస ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు మాత్రమే కాకుండా ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చని మంత్రి తెలిపారు. దీంతో ప్రజలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుల గడువును ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ఆలోచన లేదని, ఆగస్టు 10లోపు తప్పనిసరిగా దరఖాస్తులు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇంటి కోసం చెల్లించే రూ.10 వేల ఈఎండీ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హత లభించని వారికి వంద శాతం మొత్తం తిరిగి చెల్లిస్తామని మరోసారి స్పష్టం చేశారు. యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఈఎండీ చెల్లిస్తే అదే బ్యాంకు ఖాతాకు నేరుగా రీఫండ్ జమ అవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల విషయంలో పారదర్శకత, బాధ్యతతో ముందుకు సాగుతుందని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు జరిగేలా, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తోందన్నారు. ఎవరి పట్లా కక్షపూరిత వైఖరి లేకుండా సామాన్య ప్రజలు హర్షించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనే చేపడుతోందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వాన్ని సహించం

**హైదరాబాద్, జూలై 31:**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో విఫలమవుతున్న ఆయిల్ పామ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సెక్రటరీ కె.సురేంద్ర మోహన్‌ను ఆదేశించారు. సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సురేంద్ర మోహన్, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు 17,090 ఎకరాలలో మాత్రమే సాగు నమోదైందని, అంటే లక్ష్యంలో సుమారు 20 శాతం మాత్రమే పురోగతి సాధించడం అత్యంత నిరాశ కలిగించే విషయమని అన్నారు. ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నప్పటికీ కంపెనీలలో ఆశించిన స్థాయిలో చిత్తశుద్ధి కనిపించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఇప్పటికే పలుమార్లు కంపెనీలతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ పామ్ విస్తరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ కంపెనీల పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడంలేదని మంత్రి అన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్న సమయంలో కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలో లోహియా కంపెనీకి, గద్వాల, నారాయణపేట, జనగామ జిల్లాలలో పనిచేస్తున్న ఆయిల్ ఫెడ్‌కు నాలుగుసార్లు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాలో తిరుమల కంపెనీకి, భూపాలపల్లి, ములుగు, వనపర్తి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రియూనిక్ కంపెనీకి, హనుమకొండ, వరంగల్ జిల్లాలలో పనిచేస్తున్న రామ్ చరణ్ కంపెనీకి మూడుసార్లు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో గోద్రెజ్ కంపెనీకి రెండుసార్లు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. విశ్వతేజ్ కంపెనీకి ఐదుసార్లు, కేన్ బయో కంపెనీకి ఆరుసార్లు, పతంజలి కంపెనీకి ఆరుసార్లు, మాట్రిక్స్ కంపెనీకి ఐదుసార్లు, సువేన్ ఆగ్రో కంపెనీకి మూడుసార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ కంపెనీలలో ఆశించిన మార్పు కనిపించలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పతంజలి, లోహియా, కేన్ బయో, మాట్రిక్స్ కంపెనీల పరిధిలోని కొన్ని జిల్లాలను గతంలోనే తొలగించి ఇతర కంపెనీలకు అప్పగించినప్పటికీ కంపెనీలలో ఇంకా బాధ్యతాయుతమైన వైఖరి కనిపించడంలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో వెనుకబడి న ఏ కంపెనీ అయినా వారి పరిధిలోని జిల్లాలను తగ్గించడానికైనా లేక పూర్తిగా తొలగించడానికైనా ప్రభుత్వం వెనుకాడదని, మెరుగైన పనితీరు కనబరిచే కంపెనీలకు మరికొన్ని జిల్లాలను అప్పగించే ఆలోచన ఉందని అన్నారు. ప్రభుత్వ సంస్థ ఆయిల్ ఫెడ్‌కు కూడా ఎలాంటి మినహాయింపు ఉండదని, పనుల్లో పురోగతి లేకుంటే ఆ సంస్థ పరిధిలోని జిల్లాలను కూడా ఇతర సంస్థలకు లేక కొత్త సంస్థలకు అప్పగించే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సమావేశంలో మొక్కల లభ్యతపై కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆగస్టు నెలలో మొక్కల కొరత ఎదురయ్యే అవకాశం ఉన్న కంపెనీలు ముందస్తుగా ఇతర కంపెనీల నుంచి మొక్కలను కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతు మొక్కలు కోరిన వెంటనే అందించే స్థాయిలో ప్రతి కంపెనీ సిద్ధంగా ఉండాలని సూచించారు. మొక్కల లభ్యత పేరుతో ఒక్క రైతు కూడా వేచి చూడాల్సిన పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. కంపెనీల ఫీల్డ్ సిబ్బంది గ్రామ స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ తదితర అంశాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు.యూనిట్ల ఏర్పాటులో జాప్యం కూడా ప్రభుత్వం సహించదని, ఇప్పటికే కావాల్సింత సమయం కంపెనీలకు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతులకు రవాణా భారం తగ్గడంతోపాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందన్నారు. అందువల్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, రైతులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కంపెనీలకు సూచించారు.

## అధికారిక లాంఛనాలతో పెద్ది అంత్యక్రియలు

**వరంగల్, జూలై 31**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం అధికారిక లాంఛనాలతో స్వగ్రామం నల్లబెల్లిలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై జనహృదయ నేతకు తుది వీడ్కోలు పలికారు. మంత్రి సీతక్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులు పార్థివదేహానికి నివాళులర్పించారు.

హన్మకొండ నుంచి నర్సంపేట మీదుగా నల్లబెల్లి వరకు సాగిన అంతిమయాత్రలో వేలాది మంది అభిమానులు పాల్గొన్నారు. గ్రామంలో కొంతసేపు ప్రజల సందర్శనార్థం పార్థివదేహాన్ని ఉంచిన అనంతరం కుటుంబ వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అభిమానులు చివరి చూపు కోసం తరలివచ్చి భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. జూలై 26న హన్మకొండలోని నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురైన పెద్ది సుదర్శన్‌రెడ్డిని కుటుంబ సభ్యులు తొలుత స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల బృందం చికిత్స అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి తర్వాత ఆయన కన్నుమూశారు. 1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లా నల్లబెల్లిలో జన్మించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో తొలి నుంచి చురుకైన పాత్ర పోషించారు. జెడ్పీటీసీ సభ్యుడిగా ప్రజాప్రస్థానం ప్రారంభించిన ఆయన, టీఆర్ఎస్ జిల్లా కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పలు బాధ్యతలు నిర్వహించారు. ఉద్యమ కాలంలో కేసీఆర్‌కు అండగా నిలుస్తూ వరంగల్ జిల్లాలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. ప్రజలతో సన్నిహితంగా మెలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన మృతి నర్సంపేట ప్రాంతానికే కాకుండా బీఆర్ఎస్‌కు కూడా తీరని లోటుగా పార్టీ నాయకులు పేర్కొన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలి

**మొదటిపేజీ తరువాయి**

ఉత్తర్వులు వెలువడ్డాయి. లోతుకుంట భూముల వ్యవహారంలో ఇటీవల ఉన్నత న్యాయస్థానం విచారణ జరపగా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ ఆయనను ఆ పదవి నుంచి తప్పించాలంటూ సీఎస్‌ను హైకోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నది సుస్పష్టమని హైకోర్టు అందులో పేర్కొంది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని తెలిపింది. రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని, ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని సీఎస్‌కు సూచించింది. టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఈ సందర్భంగా ఉదహరించింది. చట్టపాలన మాత్రమే కొనసాగాలని, వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి మరణ శాసనం అవుతుందని పేర్కొంది.

## డ్యామేజ్ కంట్రోల్ 'ఫార్ములా'

**హైదరాబాద్, జూలై 31:**

ఫార్ములాఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వైఖరిలో మార్పు కనిపిస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఇప్పటి వరకు కేసుపై పరిమితంగానే స్పందించిన పార్టీ, ఇటీవల సోషల్ మీడియా వేదికగా తమ వాదనను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం ప్రారంభించింది. కేసు కారణంగా పార్టీతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాజకీయంగా నష్టం జరుగుతోందనే అంచనాల నేపథ్యంలో డ్యామేజ్ కంట్రోల్ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**ఎదురుదాడి వ్యూహం**

ఫార్ములాఈ కేసులో కేటీఆర్ ప్రధాన నిందితుడిగా ఉండటం, ఇటీవల ఏసీబీ కోర్టు విచారణకు హాజరుకావడం వంటి పరిణామాల తర్వాత బీఆర్ఎస్ మరింత దూకుడుగా స్పందిస్తోంది. ఆరోపణలకు కేవలం ఖండనతో పరిమితం కాకుండా, కేసుకు సంబంధించిన తమ వాదనలను పాయింట్ల వారీగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తోంది.

**పార్టీ వాదన ఇదే**

బీఆర్ఎస్ వివరణ ప్రకారం, ఫార్ములాఈ రేస్ నిర్వహణ లక్ష్యం హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నగరంగా నిలబెట్టడం, పెట్టుబడులను ఆకర్షించడం, నగర బ్రాండ్ విలువను పెంచడమే. ఈవెంట్ నిర్వహణలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఒప్పందాలు, అధికారిక ప్రక్రియల ప్రకారమే జరిగాయని పార్టీ పేర్కొంటోంది.

**ఆరోపణలపై ప్రశ్నలు**

కేసులో ప్రభుత్వానికి జరిగిన ఆర్థిక నష్టం ఎంత, ఏ నిబంధనలు ఉల్లంఘించబడ్డాయి, వ్యక్తిగతంగా ఎవరు లబ్ధి పొందారు వంటి కీలక అంశాలపై స్పష్టమైన వివరాలు లేకుండానే దర్యాప్తు కొనసాగుతోందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ అంశాలనే ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా ప్రచారాన్ని పార్టీ మరింత వేగవంతం చేసింది.

**రాజకీయ పోరాటంలో కొత్త దశ**

ఫార్ములాఈ కేసు న్యాయపరమైన అంశంగా కొనసాగుతూనే రాజకీయంగా కూడా ప్రధాన చర్చగా మారింది. ఒకవైపు ప్రభుత్వం దర్యాప్తు కొనసాగిస్తుండగా, మరోవైపు బీఆర్ఎస్ తమ వాదనను ప్రజల్లో బలంగా వినిపించే ప్రయత్నం చేస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఈ వ్యవహారం కోర్టులతో పాటు రాజకీయ వేదికలపైనా మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి**

జరిగింది. ఈ విచారణకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఏసీబీ కోర్టు నోటీసులతో తొలిసారిగా విచారణకు కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఫార్ములాఈ రేస్ కేసులో ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కార్ రేస్‌తో రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని చార్జ్‌షీట్‌లో ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, కంపెనీని నిందితులుగా ఏసీబీ అధికారులు ఈ కేసులో చేర్చారు. ఛార్జ్‌షీట్ ధాఖలు చేసిన తర్వాత మొదటి కేసును న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ ఛార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకున్నామని కోర్టు తెలిపింది. తదుపరి ఈ కేసులో ట్రయల్ మొదలు పెట్టనుంది. తదుపరి విచారణను ఆగస్టు25వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది.

## హద్దులు దాటితే కఠిన చర్యలు

**హైదరాబాద్, జూలై 31**

పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పష్టం చేశారు. విధి నిర్వహణలోనూ, వ్యక్తిగత ప్రవర్తనలోనూ హద్దులు దాటిన అధికారులపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. శాఖపై ప్రజల్లో నమ్మకం దెబ్బతినకుండా క్రమశిక్షణను మరింత కట్టుదిట్టం చేస్తామని తెలిపారు. ఓల్డ్ సిటీలోని సింహవాహిని మహంకాళి అమ్మవారి శిఖర పూజలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడిన సజ్జనార్, ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణ పూర్తిగా నిష్పాక్షికంగా కొనసాగుతోందన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వాస్తవాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటామని, చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమేనని పేర్కొన్నారు. అక్రమ సంబంధాలు, వేధింపులు, అధికార దుర్వినియోగం వంటి ఆరోపణలు రుజువైతే హోదా ఎంత ఉన్నా కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జూబ్లీహిల్స్, మలక్‌పేట్, దోమలగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటుచేసుకున్న ఘటనలతో పాటు ట్రైనీ ఐపీఎస్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఇప్పటికే సస్పెన్షన్ చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. శాఖలో క్రమశిక్షణను పటిష్ఠం చేయడానికి స్పెషల్ బ్రాంచ్ ద్వారా వివాదాస్పద అధికారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని సజ్జనార్ వెల్లడించారు. యూనిఫాం గౌరవాన్ని ప్రతి పోలీసు ఉద్యోగి కాపాడాల్సిన బాధ్యత ఉందని, కొందరి తప్పిదాల వల్ల మొత్తం శాఖకు చెడ్డపేరు రాకుండా నిరంతర పర్యవేక్షణతో పాటు అవసరమైన క్రమశిక్షణా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## సంపాదకీయం



# పార్లమెంట్‌ను సాగనివ్వని లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్!

పార్లమెంట్ సజావుగా సాగడం లేదు. వారం దాటినా కార్యక్రమాలు చేపట్టలేక పోయారు. కేవలం పేపర్ లీక్ బిల్లు మాత్రం ఆమోదం పొందింది. ఇక అనేకానేక సమస్యలు ఉన్నా వాటిపై చర్చ సాగుతుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే గతంలోనూ ఇలాగే సాగింది. గత పార్లమెంట్ రికార్డును పరిశీలిస్తే ఇదే కనిపిస్తుంది. విపక్షాలు కేవలం ఆందోళనలతో పార్లమెంట్‌ను స్తంభింప చేస్తున్నారు. పార్లమెంట్‌లో లాఠీఛార్జ్‌పై చర్చకు పట్టుబట్టడం ద్వారా తమ మొండి వైఖరిని కనబరుస్తున్నారు. పార్లమెంట్ బయటా ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తున్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ వాడడంపై నిలదీస్తున్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తుండడంతో సభ సాగడం లేదు. ఇలా ఉభయసభలు రోజూ వాయిదా పడుతూనే ఉన్నాయి. జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే బలప్రయోగానికి దిగడంపై ప్రతిపక్ష పార్టీలు హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అయితే జంతర్ మంతర్ ఘటనలో పలుఉవరు పోలీసులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. కొందరి తలలు పగిలాయి. ఎందరో రక్తమోడారు. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదని ఆయా కుటుంబాలు వాపోతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే పోలీసులు రెండురకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటుంటారు. ఆందోళనలను అణచివేయడంతో పాటు, తమతను తాము కాపాడుకుంటూ, పైఅధికారులను కాపాడాలి. ఈ సందర్భంగా వారు విధిలేని సమయంలో లాఠీఛార్జ్‌కు పాల్పడాల్సి వస్తుంది. ఇకపోతే అనేక సందర్భాల్లో అతిగా కూడా వ్యవహరించిన సంఘటనలు ఉన్నాయి. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం ఎలాంటి గుంపునైనా చెదరగొట్టడానికి నోటీసులు ఇచ్చిన తర్వాతే బలప్రయోగం చేయాలి. మానవ హక్కుల కమిషన్ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్, హెచ్చరికల తర్వాతే అత్యల్ప బలాన్ని ఉపయోగించాలి. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులను క్షేత్రస్థాయిలో పోలీసులు పూర్తిగా కాలరాస్తున్నారు. అరెస్టు సమయంలో పాటించాల్సిన చట్టబద్ధమైన పక్రియలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. అరెస్టు నిబంధనలు ఎల్లప్పుడూ పాటిస్తున్నామని కేవలం 41 శాతం మంది పోలీసులు మాత్రమే అంగీకరిస్తున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులకు కారణాలు చెప్పడం, వైద్య పరీక్షలు నిర్వహించడం వంటివి సరిగ్గా జరగడం లేదు. నిందితులు తమ న్యాయవాదిని సంప్రదించే హక్కును శాశ్వతంగా రద్దు చేయాలని 20 శాతం మంది పోలీసులు వాదిస్తున్నారు. లాఠీఛార్జీలు, హింసాత్మక సంఘటనల్లో గాయపడిన పౌరుల లెక్కల విషయంలో అధికారిక గణాంకాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. మానవ హక్కుల ఉల్లంఘనలు, కస్టడీ మరణాల వివరాల సేకరణలో మన డేటా వ్యవస్థ విఫలమవుతోంది. పోలీస్ వ్యవస్థలో సమూల సంస్కరణలు తేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పౌరుల హక్కుల రక్షణతో పాటు చట్ట పాలన సక్రమంగా సాగేలా చూడటమే ప్రజాస్వా మ్యానికి శ్రీరామరక్ష. ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ మార్గాలను ఎంచుకోవడం పోలీసు వ్యవస్థకే తీవ్ర నష్టం కలిగిస్తుంది. పోలీసులు చట్టానికి లోబడి పనిచేసేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శిక్షణ సమయంలో మానవ హక్కుల పట్ల అవగాహన పెంచడం ద్వారానే పౌర హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది. కానీ స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2025 సర్వేలో వెల్లడైన నిజాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. 17 రాష్ట్రాల్లోని 8,276 మంది పోలీసుల అభిప్రాయాలను సేకరించగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది తమ చర్యలపై ఎలాంటి విచారణ ఉండకూడదని భావిస్తున్నారు. ఈ సర్వేలో వెల్లడైన గణాంకాలు దేశంలో పోలీసుల అధికార దుర్వినియోగానికి అద్దం పడుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 70 శాతానికి పైగా పోలీసులు బాధ్యతల నిర్వహణలో బలప్రయోగం చేసినా తమపై ఎలాంటి శిక్ష పడకూడదని స్పష్టం చేస్తున్నారు. కోర్టు విచారణ లేకుండానే అనుమానితులను అరెస్టు చేసి డిటైన్ చేసే అధికారం పోలీసులకు ఉండాలని 69 శాతం మంది కోరుకుంటున్నారు. ప్రజల్లో భయం పుట్టించడానికి కఠిన పద్ధతులు ఉపయోగించడం అత్యంత అవసరమని 55 శాతం మంది పోలీసులు అభిప్రాయపడ్డారు. నిరసనకారులపై లాఠీఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగాలు చూస్తున్నప్పుడు ప్రతీ ఒక్కరి మనసులో మెదిలే ప్రశ్న ఇది. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించడానికి సమాజం నుంచి వస్తున్న ఒత్తిడే కారణమని పోలీసులు చెబుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో అమాయకులు సైతం పోలీసుల ఆగడాలకు బలవుతున్నారు. నిందితులపై తీవ్రంగా విరుచుకుపడటానికి ప్రజల ఒత్తిడే ప్రధాన కారణమని మూడింట రెండు వంతుల మంది పోలీసులు చెబుతున్నారు. . నేరాల నియంత్రణకు అసాంఘిక శక్తుల ముందస్తు అరెస్టులు చాలా ఉపయోగపడతాయని 48 శాతం మంది స్పష్టం చేశారు. నిర్బంధాల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని 43 శాతం మంది కోరుతున్నారు. 2024 రైతు ఆందోళనలు, మణిపూర్ నిరసనల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడినా ఎన్‌సిఆర్‌బి రికార్డుల్లో కేవలం ఇద్దరేనని చూపించారు. ఈ క్రమంలో ఆందోళనల సమయంలో పోలీసుల తీరును విమర్శించే వారు, వాటిని ఎలా కంట్రోల్ చేయాలో చెప్పాల్సి ఉంది. పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయాలి.

# విద్యార్థుల ముసుగులో అసాంఘిక శక్తుల దాడి

- మా సంగతేంటంటూ పోలీసుల కుటుంబాల ఆవేదన
- తమకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్



**న్యూఢిల్లీ, జులై 31:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనల సమయంలో తీవ్రంగా గాయపడిన ఢిల్లీ పోలీసు సిబ్బంది కుటుంబాలు న్యాయం కోసం ముందుకు వచ్చాయి. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో పాటు చెప్పులతో దాడి చేశారని వారు ఆరోపించారు. దేశ రాజధానిలో జరిగిన ఈ ఘర్షణల్లో ఎంతో మంది పోలీసులు గాయపడినా, కేవలం ఒక వైపు మాత్రమే ప్రచారం జరుగుతోందని, తమ ఆవేదనను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా కుటుంబాలు వాపోయాయి. శుక్రవారం మీడియా ముందుకు వచ్చిన గాయపడిన పోలీసుల భార్యలు, కుమారులు, కుమార్తెలు నాటి భయానక ఘటనలను కన్నీటిపర్యంతమవుతూ గుర్తుచేసుకున్నారు. ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో అసాంఘిక, సంఘ విద్రోహ శక్తులు చొరబడి మనుషులపైకి ఉసిగొలిపాయని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా ఓ ఏసీపీ కుమారుడు మాట్లాడుతూ.. తన తండ్రి తలకు తీవ్ర గాయమై నాలుగు కుట్లు పడ్డాయని, యూనిఫామ్ మొత్తం రక్తంతో తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేవీలో మెరైన్ కమాండోగా పనిచేసి, ప్రస్తుతం ఢిల్లీ పోలీసు విభాగంలో ఎస్సైగా సేవలందిస్తున్న తన తండ్రిని ఆందోళనకారులు ఈడ్చుకెళ్లి దాడి చేశారని, దాదాపు నాలుగు గంటల పాటు ఆయన స్పృహ కోల్పోయారని మరో కుమార్తె తెలిపారు. సోషల్ మీడియాలో తమ తండ్రినే నేరస్థుడిగా చిత్రీకరిస్తుండటంతో న్యాయం కోసం తాము సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని వెల్లడించారు. 33 ఏళ్లుగా శాఖలో సేవలందిస్తున్న తన భర్తను కూడా రాళ్లు, చెప్పులతో విచక్షణారహితంగా కొట్టారని, ఆయన హెల్మెట్ సైతం పగిలిపోయిందని మరో ఏఎస్ఐ భార్య సీమ కంటతడి పెట్టారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పోలీసులపై ఈ తరహా దాడులను సహించరాదని, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి.

# ప్రధాని మోడీ వీడియో మార్ఫింగ్

## మెటా ఇండియా హెడ్‌పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల కేసు




**హైదరాబాద్:** భారత ప్రభుత్వం, ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' మధ్య వివాదం మరింత ముదిరింది. ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ఓ వీడియోను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేశారన్న ఆరోపణలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సోషల్ మీడియా యూజర్లపై ఈ కేసులు నమోదయ్యాయి. కేంద్ర మంత్రిత్వ శాఖ గురువారం మెటాకు మరోసారి నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, హైదరాబాద్ పోలీసులు ఈ చర్యలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీజేపీ నిరసన సమయంలో ప్రధాని మోడీ షేర్ చేసిన అసలు వీడియోను కొందరు ఏఐ సహాయంతో ఎడిట్ చేసి తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేశారని పోలీసులు తెలిపారు. మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ డీప్‌ఫేక్ వీడియోలు వైరల్ అయినట్లు విచారణలో తేలింది. ఈ విజువల్స్ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, నూతన భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను ఎవరు సృష్టించారు, సోషల్ మీడియాలో ఇవి ఎలా విస్తృతంగా వ్యాపించాయి, ప్లాట్‌ఫామ్‌ల వద్ద ఉన్న భద్రతా చర్యలు వీటిని అడ్డుకోవడంలో ఎందుకు విఫలమయ్యాయి అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. వీటిని రూపొందించి షేర్ చేసిన ప్రతి ఒక్కరి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మెటా ప్రతినిధులను పిలిపించి, ప్లాట్‌ఫామ్‌లలోని నకిలీ ప్రకటనలు, మార్ఫింగ్ కంటెంట్‌ను తొలగించే ప్రక్రియపై వివరణ కోరారు. దీనిపై స్పందించిన మెటా ప్రతినిధులు అధికారుల ముందు హాజరై తమ కంటెంట్ మోడరేషన్ విధానాలను సమర్పించారు. ప్రస్తుతం ఈ విచారణ ప్రాథమిక దశలోనే ఉందని, డిజిటల్ ఆధారాల ప్రకారమే దర్యాప్తు జరుపుతామని, పూర్తి విచారణ తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు.

# విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు

## ఓపీటీ వీసాపై లక్ష డాలర్ల ఫీజుకు ట్రంప్ సర్కారు కసరత్తు

**న్యూయార్క్, జులై 31:** అమెరికాలో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. అమెరికా విశ్వవిద్యాలయాల్లో విద్య పూర్తి చేసిన తర్వాత అక్కడే ఉద్యోగం చేయాలనుకునే విదేశీ విద్యార్థులపై లక్ష డాలర్ల వరకు ఫీజు విధించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం, హెచ్-1బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజు విధించే ప్రతిపాదనకు అమెరికా కోర్టు అనుమతి ఇవ్వకపోవడంతో, ఇప్పుడు ఓపీటీ వీసా విధానంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విద్యార్థి వీసా (ఎఫ్-1) అనంతరం ఉద్యోగ అనుభవం కోసం ఇచ్చే ఓపీటీ అనుమతిపై అధిక ఫీజు వసూలు చేసే అంశాన్ని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ పరిశీలిస్తున్నట్లు కథనంలో పేర్కొన్నారు. ఓపీటీ కార్యక్రమం ద్వారా విదేశీ విద్యార్థులు తమ విద్య పూర్తయిన అనంతరం అమెరికాలో గరిష్టంగా మూడు సంవత్సరాల వరకు ఉద్యోగం చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఈ సౌకర్యాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. 2024 నాటి అధికారిక గణాంకాల ప్రకారం, సుమారు 4.19 లక్షల మంది విదేశీ విద్యార్థులు ఓపీటీ కార్యక్రమం కింద అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే హెచ్-1బీ వీసాదారులపై భారీ ఫీజు ప్రతిపాదనను అమెరికాలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థలు వ్యతిరేకించాయి. అమెరికా విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులైన విదేశీ విద్యార్థులకు ఈ సంస్థలే అధిక సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న నేపథ్యంలో, తాజా ప్రతిపాదనపై కూడా కార్పొరేట్ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, లక్ష డాలర్ల ఫీజు ప్రతిపాదనపై ట్రంప్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం ఈ అంశం విధానపరమైన పరిశీలన దశలో ఉన్నట్లు సమాచారం.

# పీవోకేలో పాక్ కాల్పులు

## తీవ్రంగా ఖండించిన భారత్

## పౌరులపై బలప్రయోగంపై ఆందోళన

## అంతర్జాతీయ దర్యాప్తు జరపాలని భారత విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 31: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో పౌరులపై పాకిస్థాన్ సైన్యం జరిపినట్లు ఆరోపణలు వస్తున్న కాల్పుల ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. పౌరులపై బలప్రయోగాన్ని ఖండిస్తూ, ఈ ఘటనలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను జవాబుదారీగా చేయాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చింది. స్థానిక మానవ హక్కుల సంఘాలు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 27, 28 తేదీల్లో రావల్‌కోట్, మీర్‌పూర్, కోట్లి, ముజఫరాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రజలు శాంతియుతంగా లాంగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ సైన్యం నిరసనకారులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనల్లో 40 మందికి పైగా నిరసనకారులు మృతిచెందగా, వంద మందికిపైగా గాయపడినట్లు స్థానిక వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా, వందలాది మందిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకుని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నాయకులు చేసిన ఆరోపణల ప్రకారం.. ఘటనల అనంతరం స్థానిక ఆసుపత్రులు, వీధుల నుంచి మృతదేహాలను భద్రతా బలగాలు తరలించి, వివరాలను గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై స్వతంత్రంగా ధృవీకరణ జరగాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో పీవోకేలో మానవ హక్కుల పరిస్థితిపై అంతర్జాతీయ సంస్థలు స్పందించాలని భారత్ కోరింది. పౌరుల భద్రత, ప్రాథమిక హక్కుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సెప్టెంబర్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

- భారత్ ఆతిథ్యంలో సమావేశాలు.. జిన్‌పింగ్ హాజరుపై ఆసక్తి
- గల్వాన్ ఘటన తర్వాత తొలి భారత పర్యటనకు అవకాశం.. అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు




**న్యూఢిల్లీ, జూలై 31:** భారత్ ఆతిథ్యంలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు అంతర్జాతీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఆయన భారత పర్యటనపై ఇప్పటివరకు భారత్ లేదా చైనా నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. బ్రిక్స్ కూటమికి ఈ ఏడాది భారత్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సభ్య దేశాధినేతలకు భారత్ ఇప్పటికే అధికారిక ఆహ్వానాలు పంపింది. అందులో భాగంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను కూడా సదస్సుకు ఆహ్వానించినట్లు సమాచారం. 2020లో గల్వాన్ లోయలో భారత్-చైనా సైన్యాల మధ్య జరిగిన ఘర్షణ అనంతరం ఇరు దేశాల సంబంధాలు తీవ్ర ఉద్రిక్తతలకు గురయ్యాయి. ఆ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. ఈ నేపథ్యంలో ఆయన ఈ సమావేశానికి హాజరైతే, గల్వాన్ ఘటన తర్వాత చేపట్టే తొలి భారత పర్యటనగా నిలవనుంది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ కీలక వేదిక అని పేర్కొన్నారు. బ్రిక్స్ కార్యకలాపాలకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని, భారత్ అధ్యక్షతను విజయవంతం చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశముందని క్రెమ్లిన్ ఇప్పటికే వెల్లడించింది. బ్రిక్స్ సభ్యదేశమైన ఇరాన్ కూడా సమావేశంలో పాల్గొనే అవకాశమున్నప్పటికీ, ఏ స్థాయి ప్రతినిధి బృందం వస్తుందన్న విషయంపై స్పష్టత లేదు. అలాగే బంగ్లాదేశ్ ప్రధానికి కూడా ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం పంపినట్లు సమాచారం. ఈ ఆహ్వానాన్ని పరిశీలిస్తున్నట్లు బంగ్లాదేశ్ విదేశాంగ వర్గాలు తెలిపాయి. బ్రిక్స్ కూటమిలో తొలుత బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా సభ్యదేశాలుగా ఉండగా, 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ చేరాయి. 2025లో ఇండోనేషియా కూడా సభ్యత్వం పొందడంతో కూటమి మరింత విస్తరించింది. భారత్ అధ్యక్షతన జరుగుతున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, పెట్టుబడులు, బహుళపాక్షిక సహకారం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. జిన్‌పింగ్ హాజరుపై అధికారిక ప్రకటన వెలువడితే, సదస్సుకు మరింత ప్రాధాన్యత ఏర్పడనుంది.

## కాంగ్రెస్ పార్టీ లో చేరిక



**శెనార్తి మీడియా,బోథ్:** బోథ్ మండలం లోని కుచిర్యాల తండా కి చెందిన పలువురు డిసిసి అధ్యక్షులు డాక్టర్ నరేష్ఆ ధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు పార్టీలో చేరిన వారిని మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లెపూల సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరారు అని తెలిపారు ఈ కార్యక్రమంలో జిసిసి చైర్మన్ తిరుపతి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పరమేశ్వర్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్ ,డిసిసి ప్రధాన కార్యదర్శి జి సంజీవ్, ఆదిలాబాద్ రూరల్ మండలం కాంగ్రెస్ అధ్యక్షులు వెంకన్న యాదవ్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దౌలత్ రావు, బొత్ కౌన్సిలర్ గిరీష్ మండల నాయకులు పన్నాల సమీందర్ రెడ్డి నాయకులు బండారి సతీష్ మహమ్మద్ కౌసర్ తదితరులు పాల్గొన్నారు

## బి ఆర్ ఎస్ పార్టీకి కి పెద్దన్న సేవలు మరువలేనివి

- పెద్ది సుదర్శన్ రెడ్డి నివాళులు
- బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్క రాజు



**శెనార్తి మీడియా,బోథ్:** బి ఆర్ ఎస్ పార్టీ నేత తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మరణం మమ్మల్ని ఎంతో మనోవేదనకు గురి చేసింది అని మండల ప్రధాన కార్యదర్శి ఎల్క రాజు అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కెసిఆర్ గారి సూచన మేరకు ప్రముఖ వైద్యులతో చికిత్స అందించిన దురదృష్టవశాత్తు వారు బ్రతికి ఉండకపోవడం చాలా బాధాకరం. తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలు. తెలంగాణ ఉద్యమంలో వారి పాత్ర చిరస్మరణీయం. వారి ఉద్యమ స్ఫూర్తిని సేవా భావాన్ని కొనసాగిస్తాం. వారి పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు. పార్టీ శ్రేణులకు. అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

## ట్రైనర్ సంగీతకు సన్మానం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలో సర్పంచ్ నేదురు పవన్ ఆధ్వర్యంలో ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తైంది. శిక్షణను పూర్తి చేసిన సందర్భంగా శిక్షకురాలు సంగీతను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నేదురు పవన్ మాట్లాడుతూ, మహిళలకు ఉపాధి కల్పించే నైపుణ్య శిక్షణలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కుట్టుమిషన్ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## భారీ వర్షా లకు ధ్వంసమైన సీసీ రోడ్డు



**శెనార్తి మీడియా, తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డు విష్ణు శివానికేతన్ స్కూల్ కు వెళ్లే దారిలో సీసీ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైంది. ఈ రోడ్డు గుండా ప్రతిరోజు ఎస్టీ కాలనీ ప్రజలతో పాటు ఆటోల ద్వారా విద్యార్థులు వెళ్తుంటారు. రోడ్డు ధ్వంసం కావడంతో సర్వీసు రోడ్డుపై దిగి పిల్లలు నడిచిపోయే పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలంలో ఈ రోడ్డు గుండా కిష్టంపేట గ్రామ శివారులోని చెరువు మట్టిని ట్రాక్టర్ల ద్వారా మాఫియా తరలించారు. ధ్వంసమైన సీసీ రోడ్డుపై చెరువు మట్టిని వేయడంతో వర్షాలు పడ్డ సమయంలో రోడ్డు బురదమయంగా మారింది. దీనికితోడు ఇటీవల భారీ వర్షాలు కురవడంతో ప్రజలకు రాకపోకలు సాగించడం కష్టతరంగా మారింది. ఇప్పటికైనా తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో స్పందించి ధ్వంసమైన సీసీ రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# బోథ్ పోలీసుల చాకచక్యం

**ఇంటి పనివాడే దొంగగా మారాడు..**
**ఇద్దరు నిందితులు అరెస్ట్**





**శెనార్తి మీడియా బోథ్:** బోథ్ మండలం సూర్యనగర్ గ్రామానికి చెందిన ధరావత్ వినోద్ కుమార్ ఇంట్లో చోరీ జరిగింది బాధితుల పిర్యాదు ప్రకారం బోథ్ ఎస్సై పురుషోత్తం దొంగతనం లో పాల్పడిన రాథోడ్ గణేష్ మరియు అర్జున్ ఆడే లను పోలీసులు కేసును త్వరగా చేదించి అరెస్ట్ చేశారు. నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఇంటి పనివాడే నేరానికి సహకరించిన విషయం దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది నిందితుల వద్ద నుంచి 1.4 కేజీల వెండి ఆభరణాలు, 15 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, IPS ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టిన బోథ్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసును ఛేదించారు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించండి. అను మానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి అని సీఐ గురు స్వామి తెలిపారు కేసును ఛేదించిన బోథ్ పోలీసు బృందాన్ని సీఐ డి. గురుస్వామి అభినందించారు

# స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి



**శెనార్తి మీడియా, కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి, జీవో నెం. 9ను రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్ యాదవ్ డిమాండ్ చేశారు. జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కరీం నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా బకాయిలు విడుదల కాకపోవ డంతో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. జీవో నెం. 9 ద్వారా కళాశా లలు నేరుగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోవ చ్చనే విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, గతంలో అమలులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్నే కొనసాగించాలని కోరారు. బీటెక్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్మీడియట్ సహా వివిధ కోర్సులు చదువుతున్న పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ సహాయంపైనే ఆధారపడుతున్నారని, అలాంటి పరిస్థితుల్లో కళాశాలలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తేవడం వల్ల అనేక కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయని అన్నారు. పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవి ష్యత్తును కాపాడాలని, జీవో నెం. 9ను రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుబ్బాసి ప్రణీత్, జిల్లా సహాయ కన్వీనర్ షేక్ వాజిద్, వర్కింగ్ ప్రెసిడెంట్ అభిలాష్ పటేల్, సాయి యాదవ్, సోషల్ మీడియా కో-ఇన్‌చార్జ్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ నీటి పంటలే సాగు చేయాలి

**ఏడీఏ శ్రీధర్**



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** అడపాదడపా కురుస్తున్న స్వల్ప వర్షాలకు ఆకర్షితులై రైతులు అధిక విస్తీర్ణంలో వరి నాట్లు వేయవద్దని సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎన్. శ్రీధర్ సూచించారు. శంకరపట్నం మండలంలోని తాడికల్, కరీంపేట గ్రామసభల్లో శుక్రవారం రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాల వ్యవధిలో పండే, తక్కువ నీటి అవసరం ఉండే పంటలైన పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలను ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసుకొని నీటి సంరక్షణ చేపట్టాలని రైతులకు సూచించారు. అనంతరం పంటల నిర్వహణ, సాగు యాజమాన్య పద్ధతులు, ప్రస్తుత పరిస్థితుల్లో అనుసరించాల్సిన వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జి. వెంకటేష్, తాడికల్ సహకార సంఘం చైర్మన్ సంపత్, కరీంపేట సర్పంచ్ లత, వ్యవసాయ విస్తరణ అధికారులు స్రవంతి, ఆరతి, రైతులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాలు శుభ్రం చేయకుంటే రూ.10వేల జరిమానా

- మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్





**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:** పట్టణంలోని విలీన గ్రామపంచాయతీలు, 49 వార్డుల పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను 15 రోజుల్లోగా శుభ్రం చేసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు రూ.10వేల వరకు జరిమానా విధించి, ఆ మొత్తాన్ని ప్రాపర్టీ ట్యాక్స్‌లో జత చేస్తామని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ హెచ్చరించారు. శుక్రవారం వార్డు నం.12 పరిధిలోని న్యూ హౌసింగ్ బోర్డ్, భగవతీనగర్ కాలనీల్లో నిర్వహించిన 'డ్రై డే–ఫ్రైడే' కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్ ఆత్రం సాయి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన, శానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, వైద్య సిబ్బందితో కలిసి కాలనీల్లో పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల నివారణకు ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త పేరుకుపోకుండా చూసుకోవడంతో పాటు డబ్బాలు, కుండీలు, నీటి ట్యాంకులు, కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఖాళీ స్థలాలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో కలుపు మొక్కలు పెరిగి, మురుగు నీరు నిలిచి దోమల వ్యాప్తికి కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాల యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించి వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన మాట్లాడుతూ జ్వరం, దగ్గు, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి, వైద్యుల సూచనల మేరకు ఉచిత వైద్యం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణ రెడ్డి, మున్సిపల్ అధికారులు, ఆరోగ్య శాఖ వైద్య సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# నకిలీ నోట్ల ముఠా బట్టబయలు

**ఏడుగురు అరెస్ట్**



**శెనార్తి మీడియా, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ రూ.500 నోట్లను అసలైనవిగా చెలామణి చేస్తున్న ముఠాను పోలీసులు ఛేదించి ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 59 నకిలీ రూ.500 నోట్లు, ఏడు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 21న కందుకూరు గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారికి రూ.18వేల నగదు ఇచ్చి, అదే మొత్తాన్ని ఫోన్పే ద్వారా తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం ఆ నగదులో 18 నకిలీ రూ.500 నోట్లు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు గుర్తించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో దర్యాప్తు చేపట్టి జూలై 30న ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో దర్యాప్తు చేశారు. దర్యాప్తులో లారీ డ్రైవర్ మారం రమేష్, అతని సోదరుడు మారం మహేష్, సార్నాలా రవీంద్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ కరెన్సీ ముఠాతో సంబంధాలు ఏర్పరుచుకున్నట్లు వెల్లడైంది. మధ్యవర్తుల ద్వారా ప్రధాన నిందితుడు జుజ్జవరపు రవి వద్ద నుంచి రూ.1లక్ష అసలు నోట్లకు బదులుగా రూ.2.10 లక్షల విలువైన నకిలీ రూ.500 నోట్లను తీసుకుని సత్తుపల్లి, వేంసూరు, ఆంధ్ర ప్రాంతాల్లో అసలు నోట్లతో కలిపి చెలామణి చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జుజ్జవరపు రవి గతంలో మంచిర్యాల జిల్లా లక్షట్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ కరెన్సీ కేసులో అరెస్టై బెయిల్పై బయటకు వచ్చినప్పటికీ, మళ్లీ ఇదే నేరానికి పాల్పడినట్లు తెలిపారు. అలాగే కాకినాడకు చెందిన కొవ్వూరి వినోద్ సతీష్ కుమార్ రెడ్డి గతంలో కూడా నకిలీ కరెన్సీ కేసులో అరెస్టై జైలుకు వెళ్లినప్పటికీ, తిరిగి నకిలీ నోట్ల సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వివరించారు.


# స్ట్రాబెర్రీలతో ఎన్నో మేళ్లు..



స్ట్రాబెర్రీలు.. ఈ పండ్లను చాలా మంది ఎంతో ఇష్టంతో తింటుంటారు. అవి చాలా రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయి. ఇటీవల స్ట్రాబెర్రీల వల్ల కలిగే అనేక ప్రయోజనాలపై నిర్వహించిన అధ్యయనంలో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఒకసారి చూద్దాం.

### గుండె ఆరోగ్యానికి మంచిది...

స్ట్రాబెర్రీలు విటమిన్ సి, ఫైబర్, పొటాషియం వంటి గుండెకు ఆరోగ్యకరమైన పోషకాలకు గొప్ప మూలం. ఈ పోషకాలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, రక్తపోటును మెరుగుపరచడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. మీ ఆహారంలో స్ట్రాబెర్రీలను చేర్చడం ద్వారా, మీరు మీ గుండె ఆరోగ్యానికి తోడ్పడవచ్చు. గుండె సంబంధ సమస్యల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.



### పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు...

స్ట్రాబెర్రీలు యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి మీ శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి, వాపు నుండి రక్షించడంలో సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్లు గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తినడం ద్వారా, మీరు మీ యాంటీఆక్సిడెంట్ తీసుకోవడం పెంచుకోవచ్చు. అలాగే మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.





### బరువు తగ్గడానికి సహాయపడుతుంది...

బరువు తగ్గించాలని చూస్తున్నట్లయితే, మీ బరువు తగ్గించే ప్రయాణానికి స్ట్రాబెర్రీలు గొప్పగా పనిచ్ చేస్తాయి. ఈ పండ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ., ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది మీకు ఎక్కువ కాలం పూర్తిగా సంతృప్తిగా ఉండటానికి సహాయపడుతుంది. అనారోగ్యకరమైన ఆహారాలకు బదులుగా స్ట్రాబెర్రీలను తినడం ద్వారా, మీరు మీ కేలరీల తీసుకోవడం తగ్గించుకోవచ్చు. అలాగే మీ బరువు తగ్గించే లక్ష్యాలకు మద్దతు ఇవ్వవచ్చు.

### రోగనిరోధక శక్తిని పెంచుతుంది...

స్ట్రాబెర్రీలు రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన విటమిన్ C తో నిండి ఉంటాయి. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తినడం ద్వారా, మీరు మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవచ్చు. అలాగే అంటువ్యాధులు, అనారోగ్యాల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. విటమిన్ C కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కూడా సహాయపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన చర్మం, గాయం నయం చేయడానికి అవసరం.

### జీర్ణక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది...

అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా, స్ట్రాబెర్రీలు ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడతాయి. ఫైబర్ ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను తినిపించడం ద్వారా పేగుల ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. మీ ఆహారంలో స్ట్రాబెర్రీలను చేర్చడం ద్వారా, మీరు మీ జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు.



# భోజనం తర్వాత నడిస్తే.. ప్రయోజనాలివే..

మీకు భోజనం చేసిన తర్వాత నడిచే అలవాటు ఉందా? లేదంటే.. ఇప్పటినుంచే తినగానే కాసేపు నడవడం అలవాటు చేసుకోండి. చాలామంది తిన్నవెంటనే చిన్నగా నిద్రపోతుంటారు. అది మీ ఆరోగ్యానికి మంచిది కాదు. ఆరోగ్యకరమైన జీర్ణక్రియ, మెరుగైన ఆరోగ్యం కోసం ప్రతి భోజనం తర్వాత కొద్దిసేపు నడవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. తిన్న తర్వాత, ఒక చిన్న నడక ద్వారా అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. తిన్న తర్వాత ఎందుకు నడవాలి? ఈ 5 కారణాలను తప్పక తెలుసుకోండి.

### మెరుగైన జీర్ణక్రియ...

తిన్న తర్వాత నడవడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపు కండరాలు, ప్రేగులను ప్రేరేపించడం ద్వారా జీర్ణక్రియకు నడక సాయపడుతుంది. ఆహారం వేగంగా కదలడానికి వీలు కల్పిస్తుంది. ఇది గుండెల్లో మంట, మలబద్ధకం, ఉబ్బరం, ఆమ్లత్వం, కడుపు నొప్పి వంటి సమస్యలను నివారించడంలో కూడా సాయపడుతుంది.



### నియంత్రిత రక్తంలో చక్కెర...


మధుమేహం ఉన్నవారికి భోజనం తర్వాత నడవడం చాలా ముఖ్యం. భోజనం తర్వాత వ్యాయామం చేయడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నిరోధించడంలో సాయపడుతుంది. అంతేకాదు..రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలను మెరుగుపరుస్తుంది.

### రక్తపోటును నియంత్రిస్తుంది...

భోజనం తర్వాత నడవడం రక్తపోటును నియంత్రించగలదని కొన్ని అధ్యయనాలు చూపిస్తున్నాయి. మీరు హైపర్‌టెన్సివ్‌గా ఉంటే.. తిన్న తర్వాత క్రమం తప్పకుండా నడవడం చాలా మంచిది. ఆరోగ్యకరమైన రక్తపోటు ఉండేలా సాయపడుతుంది.

### మంచి నిద్ర...

నడకతో మీ శరీరం రిలీఫ్ అవుతుంది. నిద్రలేమి సమస్యను నియంత్రిస్తుంది. తినడం తర్వాత జీర్ణ రుగ్మతలను తొలగిస్తుంది. మంచి నిద్రను ప్రోత్సహించడంలో సాయపడుతుంది.



### గమనించాల్సిన విషయాలు..

భోజనం, నడక మధ్య 10 నుంచి 15 నిమిషాల గ్యాప్ ఉండాలి. అలాగే, ఏదైనా అసౌకర్యంగా అనిపిస్తే నడక వేగాన్ని తగ్గించండి.

### ఆరోగ్యకరమైన బరువు...

నడక అనేది సులభమైన వ్యాయామం. కేలరీలను బర్న్ చేయడంలో సాయపడుతుంది. తొందరగా బరువు తగ్గవచ్చు. నడక మంచి మానసిక ఆరోగ్యం కూడా. అలాగే, గుండె ఆరోగ్యాన్ని సైతం పెంచుతుంది. శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుంది. మీ కండరాలు, ఎముకలను బలోపేతం చేయడం వంటి అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

# కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు మరో స్వర్ణం



**జూడోలో అస్మితా దే చరిత్ర.. భారత్‌కు తొలి గోల్డ్**

**18 పతకాలతో పట్టికలో 8వ స్థానంలో భారత్**

**గ్లాస్గో, జూలై 31:** గ్లాస్గోలో జరుగుతున్న 23వ కామన్‌వెల్త్ గేమ్స్ (2026)లో భారత జూడో క్రీడాకారిణి అస్మితా దే కొత్త చరిత్ర సృష్టించారు. మహిళల 48 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించి, కామన్‌వెల్త్ గేమ్స్ జూడో పోటీలలో భారత్‌కు మొట్టమొదటి గోల్డ్ మెడల్ అందించిన క్రీడాకారిణిగా నిలిచారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో అస్మితా కెనడాకు చెందిన హెయిడీ క్యాచ్‌ను ఓడించారు. మ్యాచ్ ప్రారంభం నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంతో జాగ్రత్తగా ఆడారు. ఒక దశలో కెనడా క్రీడాకారిణి 'యూకో' పాయింట్‌తో ఆధిక్యం సాధించినప్పటికీ, అస్మితా వెంటనే పుంజుకుని ప్రతిగా 'యూకో' పాయింట్ సాధించి 1-1తో సమానం చేశారు. నిర్ణీత సమయంలో ఇరు ప్రతినిధులు సమవుజ్జీలుగా నిలవడంతో మ్యాచ్ 'గోల్డెన్ స్కోర్' (సడన్ డెత్) కు దారితీసింది. ఒత్తిడిని జయించిన అస్మితా, సరైన సమయానికి అత్యంత ప్రతిభావంతమైన 'యూకో' పాయింట్‌ను సాధించి భారత్ కలల స్వర్ణాన్ని ఖాయం చేశారు. ఈ గెలుపుతో కామన్‌వెల్త్ గేమ్స్ జూడో చరిత్రలో స్వర్ణం సాధించిన మొదటి భారతీయ క్రీడాకారిణిగా అస్మిత నిలిచారు. ఆమె చూపిన ప్రతిభ, ఆత్మవిశ్వాసం దేశానికి గర్వకారణంగా మారాయి.

ఇప్పటి వరకు భారత్ సాధించిన పతకాల విషయానికి వస్తే.. స్వర్ణ పతకాల్లో.. అస్మితా దే (జూడో), మీరాబాయి చాను (వెయిట్‌లిఫ్టింగ్), షర్మిల ధాన్‌కర్ (పారా అథ్లెటిక్స్), దిలీప్ మహదు గావిత్ (పారా అథ్లెటిక్స్). రజత పతకాల విషయానికి వస్తే.. రిషికాంత సింగ్, ముత్తుపాండి రాజా, జ్ఞానేశ్వరి యాదవ్, హర్‌జిందర్ కౌర్, లవ్‌ప్రీత్ సింగ్ (వెయిట్‌లిఫ్టింగ్), సర్వేష్ కుషారే, గుల్వీర్ సింగ్, ఎం. శ్రీశంకర్ (అథ్లెటిక్స్). కాంస్య పతకాల విషయానికి వస్తే.. సీమా కలిరామ్నా, బింద్యారాణి దేవి, శిల్ప కె. షైలా, ఝుండూ కుమార్ సాధించారు. ప్రస్తుతం ఇండియా 4 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలతో మొత్తం 18 పతకాలు సాధించి 8వ స్థానంలో నిలిచింది.

# 64 బంతుల్లో విధ్వంసం




**అజేయ శతకంతో శ్రీలంకకు చిరస్మరణీయ విజయం**

**పాకిస్థాన్‌పై ఇమేషా దులాని వీరోచిత ఇన్నింగ్స్.. సిరీస్‌లో 1-0 ఆధిక్యం**

**కొలంబో, జూలై 31:** పాకిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో శ్రీలంక మహిళా క్రికెటర్ ఇమేషా దులాని అద్భుతమైన శతకంతో సంచలనం సృష్టించింది. ఈ ఇన్నింగ్స్‌తో ఆమె శ్రీలంక జట్టును విజయతీరాలకు చేర్చడమే కాకుండా ఒక అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో శ్రీలంక తరఫున సెంచరీ చేసిన రెండో మహిళా బ్యాటర్‌గా దులాని నిలిచింది. అంతకుముందు 2019లో ఆస్ట్రేలియాపై చామరి అటపట్టు శ్రీలంక తరఫున తొలి సెంచరీ సాధించగా, దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత దులాని (64 బంతుల్లో 101 నాటౌట్) ఈ ఘనత సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో శ్రీలంక 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టాస్ గెలిచిన శ్రీలంక మొదట ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగుల భారీ స్కోరు చేసింది. పాకిస్థాన్ ఇన్నింగ్స్‌లో షవాల్ జుల్ఫికర్ 61 పరుగులతో అత్యధిక స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ మునీబా అలీ 42 పరుగులు సాధించింది. శ్రీలంక బౌలర్లలో కవిషా దిల్హారి రెండు వికెట్లు తీయగా, కావ్య కవింది, సుగంధిక కుమారి, చాముడి ప్రబోధ తలొక వికెట్ పడగొట్టారు. అనంతరం 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఓపెనర్లు ఇమేషా దులాని, కెప్టెన్ చామరి అటపట్టు మొదటి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యంతో మంచి ప్రారంభాన్ని ఇచ్చారు. నాశ్రా సంధూ బౌలింగ్‌లో అటపట్టు (39) అవుట్ అయిన తర్వాత, విశిమి గుణరత్నె (3), హర్షిత సమరవిక్రమ (7), కవిషా దిల్హారి (11) త్వరత్వరగానే నిష్క్రమించారు. అయితే ఒకవైపు వికెట్లు పడుతున్నా దులాని మాత్రం క్రీజులో నిలకడగా ఆడుతూ పాకిస్థాన్ బౌలర్లను ఎదుర్కొంది. ఆమె తన ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 101 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చింది. 19వ ఓవర్ చివరి బంతికి శ్రీలంక విజయాన్ని ఖాయం చేసుకుంది. పాకిస్థాన్ బౌలర్లలో నాశ్రా సంధూ రెండు వికెట్లు పడగొట్టింది.

# రుతురాజ్, పటీదార్‌కు మళ్లీ నిరాశ

**భారత్ టెస్టు జట్టులో చోటు దక్కని ఐదుగురు ప్రముఖులు**

**శ్రీలంక సిరీస్‌కు 15 మంది జట్టును ప్రకటించిన బీసీసీఐ**




న్యూఢిల్లీ, జూలై 31: శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. యువ ఆటగాడు సారాంశ్ జైన్‌కు తొలిసారి అవకాశం కల్పించగా, పలువురు ప్రముఖులకు చోటు దక్కకపోవడం చర్చనీయాంశమైంది. ఆగస్టు 15 నుంచి 19 వరకు గాల్‌లో తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలో రెండో టెస్టు జరగనుంది. సిరీస్‌కు ముందు ఆగస్టు 7 నుంచి భారత జట్టు నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఈ జట్టు ఎంపికలో సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి మరోసారి అవకాశం దక్కలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత జట్టుకు దూరంగా ఉన్న షమీ దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నప్పటికీ సెలెక్టర్లు ఆయనను పరిగణనలోకి తీసుకోలేదు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనలు చేస్తున్న రుతురాజ్ గైక్వాడ్, రజత్ పటీదార్‌లకు కూడా నిరాశే ఎదురైంది. అలాగే రంజీ ట్రోఫీలో అత్యధిక వికెట్లు సాధించిన జమ్మూ కాశ్మీర్ పేసర్ ఆకిబ్ నబీ దార్‌కు కూడా జట్టులో స్థానం లభించలేదు. గతంలో ఫిట్‌నెస్ మెరుగుపర్చుకుని తిరిగి రాణించిన సర్ఫరాజ్ ఖాన్‌ను కూడా సెలెక్టర్లు పక్కన పెట్టారు. శుభ్‌మన్ గిల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. జట్టులో యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్ తదితరులు చోటు దక్కించుకున్నారు. వాషింగ్టన్ సుందర్ తొలి టెస్టుకు అందుబాటులో ఉండరని బీసీసీఐ వెల్లడించింది. సాయి సుదర్శన్, జస్ప్రీత్ బుమ్రా తుది జట్టులో ఆడే విషయంపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపింది. అయితే బుమ్రా ఫిట్‌నెస్ సాధించినట్లు వార్తలు వస్తుండటంతో తొలి టెస్టులో ఆయన బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.




# ప్రైవేట్ సంస్థలకు వరల్డ్‌కప్ హక్కుల విక్రయం?

**ఫిఫా ప్రతిపాదనపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత**

**20 బిలియన్ డాలర్ల ప్రణాళికతో వివాదంలో అధ్యక్షుడు ఇన్ఫాంటినో**

**జ్యూరిక్, జూలై 31:** ప్రపంచ ఫుట్‌బాల్ పాలక సంస్థ ఫిఫా ప్రతిపాదించిన వరల్డ్‌కప్ వాణిజ్య హక్కుల విక్రయ ప్రణాళికపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఫిఫా అధ్యక్షుడు జియాని ఇన్ఫాంటినో, ప్రపంచకప్‌తో పాటు క్లబ్ వరల్డ్‌కప్ వాణిజ్య హక్కులను సుమారు 20 బిలియన్ డాలర్ల విలువైన ప్రత్యేక అనుబంధ సంస్థగా మార్చి, అందులో 20 శాతం వాటాను ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు విక్రయించే ప్రతిపాదన తీసుకురావడం వివాదానికి దారితీసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఫిఫా సీనియర్ సలహాదారు కార్లోస్ కార్డెయిరో తన పదవికి రాజీనామా చేశారు. ఈ ప్రతిపాదన ఫుట్‌బాల్ భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆయన పేర్కొంటూ, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఫిఫా ప్రతిపాదనను ఇప్పటికే యూరప్, ఉత్తర అమెరికా ఫుట్‌బాల్ సమాఖ్యలు తిరస్కరించగా, తాజాగా ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ కూడా వాటికి మద్దతు ప్రకటించింది. ఈ ప్రణాళికను ఉపసంహరించుకునే వరకు ఫిఫా నిర్వహించే టోర్నమెంట్‌లను బహిష్కరించే అంశాన్ని కూడా యూరోపియన్ సమాఖ్య పరిశీలిస్తున్నట్లు సమాచారం. విమర్శలపై స్పందించిన ఫిఫా, తాము ఫుట్‌బాల్‌ను విక్రయించడం లేదని స్పష్టం చేసింది. ప్రతిపాదిత పెట్టుబడి ప్రణాళికపై అపోహలు నెలకొన్నాయని, సభ్య దేశాలకు పగిర్తి వివరాలు తెలియజేస్తామని పేర్కొంది. అయితే ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ మాత్రం సభ్య దేశాలతో తగిన సంప్రదింపులు జరపకుండా నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని, ఫిఫా పరిపాలనా వ్యవస్థపై సమగ్ర సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా, వచ్చే ఏడాది జరగనున్న ఫిఫా అధ్యక్ష ఎన్నికల్లో జియాని ఇన్ఫాంటినో మరోసారి పోటీ చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ఈ వివాదం ఆయనకు రాజకీయంగా ప్రతికూలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రానున్న మహిళల అండర్-20 ప్రపంచకప్ నిర్వహణపై కూడా ఈ పరిణామాల ప్రభావం పడే అవకాశం ఉందని అంతర్జాతీయ క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.





# వైభవ్‌కు వైస్ కెప్టెన్సీ.. సరైన నిర్ణయమేనా?

**దులీప్ ట్రోఫీ ఎంపికపై హర్షా భోగ్లే సందేహాలు**

**15 ఏళ్ల ఆటగాడికి నాయకత్వ బాధ్యతలపై క్రికెట్ వర్గాల్లో చర్చ**

**ముంబై, జూలై 31:** భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి దులీప్ ట్రోఫీ కోసం ప్రకటించిన ఈస్ట్ జోన్ జట్టులో వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించడంపై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. 2026-27 దేశీయ సీజన్‌కు ఎంపికైన జట్టులో ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా ఉండగా, కేవలం 15 ఏళ్ల వయసున్న వైభవ్‌ను ఉప కెప్టెన్‌గా నియమించడం విశేషంగా మారింది. ఈ నిర్ణయంపై భారత ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెడ్‌బాల్ క్రికెట్‌లో పరిమిత అనుభవం ఉన్న ఆటగాడికి ఇంత త్వరగా నాయకత్వ బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న ఆలోచన ఏమిటో తెలుసుకోవాలని పేర్కొన్నారు. "వైభవ్ అసాధారణ ప్రతిభ కలిగిన ఆటగాడే. కానీ ఇప్పటివరకు రెడ్‌బాల్ క్రికెట్‌లో 12 ఇన్నింగ్స్‌ల్లో 207 పరుగులు మాత్రమే చేశాడు. అతని సగటు 17.25. ఇంకా నేర్చుకునే దశలో ఉన్న ఆటగాడికి ఉప కెప్టెన్సీ అవసరమా?" అని హర్షా భోగ్లే ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ, అదే జోరుతో ఈస్ట్ జోన్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయితే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడికి పరిమిత అనుభవమే ఉంది. ఇప్పటివరకు ఎనిమిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన వైభవ్ 207 పరుగులు చేయగా, అత్యధిక స్కోరు 93గా నమోదైంది. దులీప్ ట్రోఫీలో వైభవ్ ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశముంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ షమీ, ముఖేశ్ కుమార్ వంటి అనుభవజ్ఞులైన పేసర్లు జట్టుకు బలాన్నివ్వనున్నారు. వైభవ్‌కు వైస్ కెప్టెన్సీ ఇవ్వడం ద్వారా భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దాలనే ఉద్దేశమా, లేక అతని ప్రతిభపై సెలెక్టర్లకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమా అన్న అంశంపై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. దులీప్ ట్రోఫీలో బ్యాటింగ్‌తో పాటు నాయకత్వ లక్షణాలను కూడా వైభవ్ ఎలా ప్రదర్శిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.




## వారణాసి వాయిదా ప్రచారాలకు చెక్


దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మెగా ప్రాజెక్ట్ వారణాసిపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న వాయిదా ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడింది. ఈ సినిమా ప్రకటించిన తేదీకే విడుదల కానుందని చిత్ర యూనిట్‌కు చెందిన విశ్వసనీయ వర్గాలు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అభిమానుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వారణాసి' ఒకటి. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ ముగ్గురు స్టార్ల కలయికతో పాటు రాజమౌళి దర్శకత్వం కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృత స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా విడుదల తేదీ మారొచ్చని ప్రచారం జరిగింది. అయితే చిత్ర యూనిట్ వర్గాల సమాచారం ప్రకారం అలాంటి పరిస్థితి ఏదీ లేదని, సినిమా ముందుగా ప్రకటించినట్లుగానే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రణాళిక ప్రకారమే కొనసాగుతున్నాయని సమాచారం. ఇప్పటికే కీలక షెడ్యూళ్లు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చిత్రబృందం పని చేస్తోందని తెలుస్తోంది. 'వారణాసి' విడుదలకు ఇంకా 250 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అభిమాను ల్లో ఉత్సాహం మరింత పెరిగింది. రాజమౌళి ప్రతి సినిమాను అంతర్జాతీయ స్థాయిలో రూపొందించే తీరు, మహేష్ బాబు తొలిసారి ఆయన దర్శకత్వంలో నటిస్తుండటం, ప్రియాంక చోప్రా రీఎంట్రీ వంటి అంశాలు ఈ చిత్రాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. భారీ బ్జడెట్‌తో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టుకు తీసుకెళ్తుందనే అంచనాలు ఉన్నాయి. విడుదల తేదీపై స్పష్టత రావడంతో ఇకపై చిత్రబృందం నుంచి టీజర్, పోస్టర్లు, ఇతర ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన వరుస అప్‌డేట్లు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## 3న అగాధ ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

సీనియర్ దర్శకుడు, నిర్మాత ఎంఎస్ రాజు మరోసారి దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'అగాధ'. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 3 మధ్యాహ్నం 12 గంటలకు 'అగాధ' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ ద్వారా సినిమా కథ, ఆధ్యాత్మిక నేపథ్యం, మిస్టరీ ఎలిమెంట్స్‌పై మరింత స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచేలా ట్రైలర్ ఉండబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కెఆర్ సమర్పిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ఎంఎస్ రాజు స్వయంగా నిర్వహించడం విశేషం. తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించిన ఆయన, ఈసారి విభిన్నమైన ఆధ్యాత్మిక థ్రిల్లర్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్లతో పాటు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయా రాణి రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. భారీ స్థాయిలో రూపొందిన 'అగాధ' చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుండటంతో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తీసుకురాబోతున్నారు. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ట్రైలర్ విడుదల అనంతరం మరింత దూకుడుగా ప్రమోషన్స్ నిర్వహించనుంది. మిస్టరీ, ఆధ్యాత్మికత, థ్రిల్లింగ్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం ఎంఎస్ రాజుకు దర్శకుడిగా మరో విజయాన్ని అందిస్తుందా అనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది.




## రామాయణ మూవీలో డ్రెస్సింగ్‌పై సోషల్ మీడియాలో రచ్చ



బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలైనప్పటి నుంచీ పలు అంశాలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. తాజాగా ఈ చిత్రంలో రాణి కైకేయి పాత్రలో నటిస్తున్న ప్రముఖ నటి లారా దత్తా తొలి లుక్‌పై నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. త్రేతాయుగంలో సాగిన పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో, లారా దత్తా ధరించిన మోడ్రన్ డిజైనర్ బ్లౌజ్, స్టైలిష్ హెయిర్‌స్టైల్ పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. త్రేతాయుగ కాలానికి తగినట్లుగా కాకుండా, ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా నీట్‌గా కుట్టిన డిజైనర్ బ్లౌజ్, హెయిర్, సెలూన్ స్టైల్ హెయిర్‌స్టైల్‌తో లారా కనిపించడంపై విమర్శలు వస్తున్నాయి. త్రేతా యుగంలో ప్లెయిన్ రా సిల్క్ చీరలు, హెవీ స్టోన్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు ఎవరూ డిజైన్ చేసేవారు? అంటూ కొందరూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక లారా దత్తా లుక్ చూస్తుంటే రామాయణంలా కాకుండా, ఏవో ఏక్తా కపూర్ టీవీ సీరియల్ షూటింగ్‌లో పాల్గొన్నట్లుగా ఉందని మరికొందరు కామెంట్ చేశారు. ఇక సినిమా మేకర్స్ తీసుకున్న ఈ సృజనాత్మక స్వేచ్ఛ, కాస్ట్యూమ్ డిజైన్ పై వస్తున్న విమర్శలపై చిత్ర యూనిట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి!

మహర్షి వాల్మీకి రామాయణం, తులసీదాస్ రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా, నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, రవి దూబే, అరుణ్ గోవిల్, వివేక్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నటనలో అడుగుపెట్టా

### అందాల తార ప్రీతి ముకుందన్ అంతరంగం

తాను నటనని కెరీర్‌గా ఎంచుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అందాల తార ప్రీతి ముకుందన్ అభిప్రాయపడింది. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళీ'లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన మొదటి ఆడిషన్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర సంగతిని పంచుకుంది. మా ఫ్యామిలీలో అందరం చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టే వాళ్లం. మా వాళ్లు చదువులో నన్ను ఎంతగా ప్రోత్సహించేవారో.. నేను నా మనసుకు నచ్చినట్టు కూడా నడుచుకోవాలని అంతే పట్టుదలతో ఉండేవారు. అందుకే కెరీర్ ప్రారంభంలో కొంత కాలం మోడలింగ్ చేశాను. 18 ఏళ్ల వయసులోనే నాకు ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అప్పుడు నటనపై నాకంత నమ్మకం లేక ఆడిషన్ ఇవ్వలేనని చెప్పేశా. కానీ మా అమ్మానాన్న 'నువ్వు ఇది ఎందుకు ప్రయత్నించకూడదని ఆడిషన్‌కు వెళ్లమని ప్రోత్సహించారు. దాంతో ఆడిషన్‌లో నా వంతు నేను ప్రయత్నించాను కానీ, ఆ పాత్ర దక్కలేదు. కానీ నా తల్లిదండ్రులు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన క్షణమది. చిత్రపరిశ్రమ ఓ కొత్త ప్రపంచం. మా వాళ్లకి దాని గురించి ఏ మాత్రం తెలియదు కానీ, మనసుకి నచ్చింది చేయమని చెప్పడంతోనే నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాతే నెమ్మదిగా నటన పట్ల అభిరుచి పెరిగి, సినిమాని ప్రేమించడం మొదలు పెట్టానని అంది.

## దీపావళి బరిలో సూర్య 47 మూవీ

కథానాయకుడు సూర్య ఇటీవలే 'కరుప్పు' సినిమా విజయంతో తదుపరి చిత్రాల విషయంలో జోరు పెంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఆయన... మమితా బైజు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో ప్రేక్షకుల్ని మరోసారి పలకరించనున్నారు. అయితే తాజాగా సూర్య, కథానాయిక నజ్రియా జంటగా రూపొందుతున్న 'సూర్య 47' చిత్రం కూడా విడుదల తేదీని ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని చిత్రబృందం దీపావళికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. దీపావళికి విడుదల ఖరారైతే ఈ ఏడాది సూర్య ఖాతాలో మూడు చిత్రాలు చేరనున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో నస్లేన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు.




Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644